ముందస్తుగా బడిబాట

- పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా ఉండటంతో అడ్మిషన్లు పెంచుకోవడానికి ప్రయత్నాలు
- జూన్‌లో నిర్వహించాల్సి ఉన్నా ముందస్తుగా ప్రచారానికి ఉపక్రమించిన ఉపాధ్యాయులు



దొన్కల్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 70కే పరిమితమైంది. దొన్కల్ ఉన్నత పాఠశాలలో కేవలం 40 మంది విద్యార్థులే ఉన్నారు. ప్రైవేటు పాఠశాలల పోటీ వల్ల ఈ రెండు ప్రభుత్వ పాఠశాలలే కాదు అనేక పాఠశాలల్లోను విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల సంఖ్యను పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ రెండు పాఠశాలల ఉపాధ్యాయులు ముందస్తుగానే బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలల మనుగడను కాపాడుకోవడానికి శత విధాలుగా ప్రయత్నాలను మొదలు పెట్టారు. షెడ్యూల్ ప్రకారం బడిబాట కార్యక్రమాన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసి తరగతులు పునఃప్రారంభమయ్యే సమయంలో బడిబాట నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఒంటిపూట తరగతులు మొదలైన నాటి నుంచి అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరుగుతున్నారు. ప్రైవేటు పాఠశాలల పోటీని తట్టుకోవాలంటే తాము కూడా ఇంటింటి ప్రచారం చేయాలని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.



మోర్తాడ్‌లో..

కల్వర్టులు నిర్మించారు.. రోడ్డు పనులు మరిచారు

- రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ప్రారంభం కాని గంగమ్మ రోడ్డు పనులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కల్వర్టులు కట్టి వదిలేసిన రోడ్డు

బాల్కొండ: నాగాపూర్ శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం (గంగమ్మ) వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మోక్షం లభించలేదు. గ్రామ శివారు నుంచి గంగమ్మ ప్రాంతం వరకు తారు రోడ్డు కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.1.15 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అదే సంవత్సరం రోడ్డు నిర్మాణం మధ్యలో వచ్చే కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. కాని రోడ్డు పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. గ్రామం మీదుగా ప్రతి శుక్రవారం, సోమవారం భక్తులు అధిక సంఖ్యలో గంగమ్మ చెంతకు వెళ్తుంటారు. ప్రస్తుతం గంగమ్మ వద్ద శివాలయం గతేడాది నిర్మించడంతో భక్తుల రద్దీ కూడా బాగా పెరిగింది. అక్కడి వరకు వెళ్లటానికి మట్టి రోడ్డు మాత్రమే ఉంది. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గంగమ్మ చెంతకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భక్తులే కాకుండా గంగమ్మ వద్ద నుంచి అనేక మంది మత్స్యకారులు చేపల వేట కోసం ప్రాజెక్ట్‌లోకి వెళ్తుంటారు. ఇలా నిత్యం ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తూనే ఉంటారు. ప్రధానంగా ప్రాజెక్ట్‌లో చేప పిల్లలను వదలటానికి పెద్ద పెద్ద వాహనాల్లో చేప పిల్లలను కూడ ఈ రోడ్డు గుండానే తరలిస్తూ ఉంటారు. పాలకులు స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి, పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని భక్తులు, మత్స్యకారులు కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

నాగాపూర్ నుంచి గంగమ్మ వరకు చేపట్టవలసిన రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే చేపడుతాం. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల పనులను ఒక్కొక్కటిగా చేపడుతూనే ఉన్నాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రారంభిస్తాం.

– నాందేవ్, డిప్యూటీ ఈఈ, బాల్కొండ

క్లుప్తంగా

ఆదివాసి నాయక్‌పోడు సేవా సంఘం అధ్యక్షుడిగా రంజిత్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ ఆదివాసి నాయక్‌పోడు సేవా సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన మీనుగు రంజిత్ ఎన్నికయ్యారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రంజిత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ.. గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య దైవం భీమన్న గుడి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. నిజామాబాద్ జిల్లా ఆదివాసి నాయకపోడు ఉద్యోగుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కొసెడుగు రవి, మండల ప్రధాన కార్యదర్శి మేడిపల్లి గౌతం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సేవారత్న పురస్కారం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ అమీనా బేగంకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవారత్న పురస్కారం మంగళవారం హైదరాబాద్‌లో కేఎల్ఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో అందజేశారు. కరోనా కష్ట కాలంలో సుమారు 15వేల మందికి అన్నదానం చేసినందుకు గుర్తింపుగా పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు స్వాతి, నగేష్, జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది వీఆర్ దేశాయ్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ప్రీతం దేశాయ్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ కవిత.. ప్రీతం దేశాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం గోనుగొప్పులకు చెందిన గోపరి ఒడ్డెన్న అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనకు మెరుగైన వైద్యం కోసం రూ.1.10 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అందించారు. వేల్పూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎల్‌వోసీని అందించారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



మోర్తాడ్: మోర్తాడ్, ధర్మోరాలకు చెందిన ప్రశాంత్, గణేషలు వారి మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకోగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారు. రెండు మొబైల్ ఫోన్‌లను పోలీసులు ట్రేస్ చేసి స్వాధీన పరుచుకుని బాధితులకు పోలీసులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎవరైనా చౌకగా వస్తున్నాయని బయట ఎలాంటి రసీదు లేని మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేయవద్దని సూచించారు. మొబైల్ ఫోన్‌లు పోతే వాటిని వెతికి పట్టుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నందిపేట్(ఆర్మూర్): శాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బొంతల చిన్నయ్యకు రూ. 87 వేలు, నీరడి బోజమ్మకు రూ.60 వేలు, దేవగౌడ్‌కు రూ. 24 వేల విలువైన చెక్కులను అందించారు. నాయకులు ఖదీర్, కిష్టాగౌడ్, కాంతం, చిన్నయ్య, పిరాజీ నాగరాజ్, మన్నె సాగర్ పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో..

బాల్కొండ: జలాల్‌పూర్ గ్రామానికి చెందిన దామ ప్రతాప్‌కు అదే గ్రామంలో రూ. 25,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్, మోహన్‌రెడ్డి, నర్సారెడ్డి, భోజన్న, నితీష్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీలను నిషేధించాలి



వర్ని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

వర్ని: చట్టబద్ధతలేని గ్రామాభివృద్ధి కమిటీలు గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాలను నడుపుతూ అణగారిన బడుగు, బలహీన ప్రజలను సాంఘిక బహిష్కరణలు చేస్తూ, చట్టాన్ని ధిక్కరిస్తున్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే నిషేధించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీలను నిషేధించాలని కోరుతూ వర్ని తహసీల్దార్ సాయిలు, మోస్రా తహసీల్దార్ మారుతీలకి వినతి పత్రం అందజేశారు. అనంతరం నన్నేసాబ్ మాట్లాడారు. నేతలు సాయిబాబు, గాయత్రి, శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ తాళ్ల రాంపూర్‌లో గౌడ, గీత కార్మికులపై గ్రామాభివృద్ధి కమిటీల(వీడీసీ) దౌర్జన్యాలు, సామాజిక బహిష్కరణలపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారి విక్రమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, తాళ్ల రాంపూర్ మాజీ సర్పంచ్ కోటగిరి రమాగౌడ్ మాట్లాడారు. వీడీలను నిషేధంపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ నెల 22 చలో ఆర్మూర్ కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సీపీఎం నేతలు కుతాడి ఎల్లయ్య, టీ భూమన, కులదీప్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలి

నందిపేట్(ఆర్మూర్): పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఉండాలని మండల విద్యాధికారి అవదూత గంగాధర్ సూచించారు. నందిపేట మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్, పేరెంట్స్ వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ట్రైనర్ వజ్జ నవనీత.. పిల్లల పట్ల తలిదండ్రుల ప్రవర్తన ఎలా ఉండాలో వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ జరిపించండి



రుద్రూర్: కోటగిరిలో సన్న ధాన్యం బోనస్ డబ్బుల మళ్లింపుపై సమగ్ర విచారణ జరిపించి నిధులు రికవరీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కోటగిరి సింగిల్ విండో కార్యాలయానికి విచారణ చేయడానికి వచ్చిన అధికారి అంబర్‌సింగ్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల సీపీఐ కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ...రైతుల పేరుతో బోనస్ డబ్బులు కాజేసిన విషయమై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని అధికారులను కోరామన్నారు.

గంగామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



బషీరాబాద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో గంగామాత జాతరోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆలయాన్ని దర్శించుకొని గంగామాతకు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు గడ్డం స్వామి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి నుంచి బషీరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో చలో వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవం విజయవంతం చేయాలని చేపట్టిన వాల్ పెయింటింగ్‌ను పరిశీలించారు.

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మల్లన్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

యువవికాసం.. 9,439 దరఖాస్తులు

నిజామాబాద్ సిటీ: రాజీవ్ యువ వికాసం పథకానికి బల్దియా పరిధిలో ఇప్పటివరకు 9,439 మంది దరఖాస్తు చేసుకున్నట్లు బల్దియా అధికారులు తెలిపారు. ఈ పథకానికి ఈనెల 14 చివరి తేదీగా ప్రభుత్వం గడువు విధించింది. దీంతో దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను నేరుగా మున్సిపల్ కార్పొరేషన్‌లోని కౌంటర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 9,439 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎస్సీ కార్పొరేషన్‌లో 1374 మంది, బీసీ కార్పొరేషన్‌లో 1,579, ఎస్టీ కార్పొరేషన్‌లో 186 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ముస్లిం మైనారిటీ కార్పొరేషన్‌కు మాత్రం 5,629 మంది దరఖాస్తు చేసుకున్నారు. క్రిస్టియన్ మైనారిటీకి కేవలం 51 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈబీసీ కింద 36 మంది, వికలాంగులు, ఇతర కేటగిరిలకు చెందిన వారి నుంచి 584 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



పాదయాత్ర చేస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు

రుద్రూర్: రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి హాజరై స్థానిక నాయకులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోని బలహీన వర్గాల ప్రజలకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తే కాంగ్రెస్ ఊరుకోబోదని అన్నారు. నేతలు గంగా శంకర్, ఇందూర్ చంద్రశేఖర్, తోట అరుణ్ కుమార్, నరోజి గంగారాం, పత్తి రాము, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత లేదు



నందిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమ్మర్‌పల్లిలో ..



బాల్కొండ మండల కేంద్రంలో ..



భీమ్‌గల్‌లో..



మోస్రాలో ..

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల శుద్ధి పేరుతో విగ్రహాలను బీజేపీ నాయకులు తాకడాన్ని నిరసిస్తూ మంగళవారం బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ..నిండు పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన బీజేపీ నాయకులకు ఆయన విగ్రహాలను తాకే అర్హత లేదన్నారు. బీజేపీ నాయకులు ఒక పక్క లోక్‌సభలో అంబేడ్కర్‌ను అవమాన పరుస్తూ మరో పక్క విగ్రహాల శుద్ధి పేరుతో కార్యక్రమం చేపట్టడం విడ్డూరమని అన్నారు. – సాక్షినెట్‌వర్క్

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



బోధన్ రైల్వే స్టేషన్‌లో వారోత్సవాల వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు



ఆర్మూర్‌టౌన్: ప్రమాదం జరిగినప్పుడు ఏవిధంగా కాపాడాలో చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బోధన్‌టౌన్(బోధన్): వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ డిపో, కొత్త బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. వారోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రైల్వే స్టేషన్ మేనేజర్ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, సిబ్బంది శ్రీనివాస్, ఆనంద్, రాహుల్ ఉన్నారు.

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు, వివేకానంద చౌరాస్తాలో అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవలసిన చర్యల గురించి డెమో ప్రదర్శించారు. ఎస్ఎఫ్‌వో నర్సింగ్, ఎల్ఎఫ్ నరేష్, డీవోపీ సురేష్, ఎఫ్ఎంలు శారజ్, సురేష్‌లు పాల్గొన్నారు.

బాల్కొండ: బాల్కొండ ఫైర్ స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మెండోరా మండల కేంద్రంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా మంటలార్పే విధానం గురించి వివరించారు. అగ్ని ప్రమాదలు సంభవించకుండా చేపట్టే చర్యల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జీవన్‌రెడ్డి మల్టీప్లెక్స్‌లో సిబ్బందికి మంగళవారం అగ్నిమాపక శాఖ అధికారుల ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రాక్టికల్‌గా వివరించారు. కరపత్రాలను అందజేశారు. అగ్నిమాపక శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఉపాధి హామీ పనుల తనిఖీ

వేల్పూర్: కుకునూర్‌లో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో బాలకిషన్ మంగళవారం తనిఖీ చేశారు. పనులకు ఎంతమంది హాజరైంది.. ఏయే పనులు చేస్తున్నారో తెలుసుకున్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఏపీవో అశోక్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



బాల్కొండ: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ముప్కాల్ ఎంపీడీవో నరేష్ ఆనంద్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలం రెంజర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి బాలింతలకు ముర్రుపాలపై అవగాహన కల్పించారు.

వేల్పూర్‌లో ఐసీడీఎస్ పోషణ పక్షం

వేల్పూర్: వేల్పూర్ జీపీ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు కచ్చితంగా తినాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సామూహిక సీమంతం నిర్వహించారు. వేల్పూర్ పీహెచ్‌సీ సీహెచ్‌వో నారాయణ, ఆరోగ్యకార్యకర్తలు అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.



సుంకెట్‌లో ..

మోర్తాడ్: సుంకెట్‌లో పోషణ పక్షం కార్యక్రమం మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మంచి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐసీడీఎస్ అధికారులు జ్ఞానేశ్వరి, మంజుల, ప్రశాంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వేల్పూర్: కుకునూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి మంగళవారం ప్రారంభించారు. పడగల్ సొసైటీ వైస్ చైర్మన్ దొనికెర నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, నాయకులు భూమారెడ్డి, రవి, రమణ, మధు, రైతులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ ఫొటో ఏర్పాటు చేయాలి

పోతంగల్: కొత్తగా ఏర్పడ్డ పోతంగల్ మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫొటో ఏర్పాటు చేయాలని బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మార్పీస్ ఇన్‌చార్జి సోంపూర్ పోచిరాం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మంగళవారం ఎంపీడీవో చందర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు రిజర్వేషన్ ఫలాలు అందించి వారికి ఉన్నత ఉద్యోగావకాశాలు దక్కేటట్టు చేసిన మహనీయుడిని ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

నందిపేట్(ఆర్మూర్): మల్లారంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు మొదటి విడతగా బిల్లులు అందజేయాలని హౌజింగ్ ఏఈని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రెంజల్(బోధన్): దూపల్లి, కళ్యాపూర్‌లో నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బుధవారం పర్యటిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్ ఖాన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రైతులతో సమావేశమై ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని వివరించారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు) - 10.00, 1.05, 7.15, 10.20, ఫలక్‌నుమా దాస్(తెలుగు)-4.10
స్క్రీన్-2	జాక్(తెలుగు)-10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-3	ద మమ్మీ (తెలుగు)-12.20, 2.50, 5.20, 7.50, 10.20
స్క్రీన్-4	గుడ్‌బ్యాడ్ అగ్లీ (తెలుగు)-10.30, 1.25 7.05, 10.0, మ్యాడ్ స్క్వేర్(తెలుగు) -4.20



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు	డ్రెస్సడ్	200
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	93,200	వెండి(కిలో)	100,500
22 క్యారెట్స్	86,025		

– నిజామాబాద్ బిజినెస్